గ్రేడ్ - I

పొలమే బంగారం

రచన

డా॥ యం. హరికిషన్

గ్రేడ్ - I కఠిన పదాలు లేని చిన్న కథలు

పొలమే బంగారం

రచన

డా॥ యం. హరికిషన్

కర్నూలు ప్రచురణలు

పొలమే బంగారం

ఒక రైతుకు నలుగురు కొడుకులున్నారు. వాళ్ళు పెద్ద సోమరిపోతులు. ఏ పనీ చేసేవాళ్ళు కాదు.

రైతు ముసలివాడు అయిపోయాడు. పొలాన్ని చూసుకొనేవాళ్ళు ఎవరూ లేక పిచ్చిమొక్కలు పెరిగి ఆ పొలం పనికిరానిదిగా తయారయింది.

ఒకరోజు రైతు నలుగురు కొడుకులను పిలిచాడు. “నేను సంపాదించిన డబ్బంతా మన పొలంలో దాచిపెట్టాను. కానీ ఎక్కడ దాచిపెట్టానో గుర్తుకు రావడం లేదు” అన్నాడు.

కొడుకులు తండ్రి మతిమరుపుకు తిట్టుకున్నారు. డబ్బు మీది ఆశతో పొలమంతా శుభ్రం చేశారు. నాగలితో కిందికీ మీదికీ బాగా దున్నారు. ఐనా ఏమీ దొరకలేదు.

వాళ్ళ నాయన అదిచూసి “ఎక్కడికి పోతుందిలే దొరకక ... ఎలాగూ పొలం దున్నారు గదా... నాట్లేసి సాగు చేయండి” అన్నాడు.

వాళ్ళు తిట్టుకుంటూనే సాగు చేశారు. మూడు నెలలు తిరిగే సరికి పొలం విరగకాసింది. రైతు దాన్నంతా తీసుకొనిపోయి అమ్మేశాడు. చాలా డబ్బులు వచ్చాయి. రైతు నవ్వుతూ డబ్బులు వాళ్ళ చేతిలో పెట్టి “ఇదేరా పొలంలో నేను దాచిన సంపద, మీరు ఎన్నిసార్లు కష్టపడితే అన్నిసార్లు దొరుకుతూనే వుంటుంది” అన్నాడు.

ఆ రోజు నుండి రైతు కొడుకులు కష్టపడి సంపాదించడం మొదలుపెట్టారు.



చేయి చేయి కలుపుదాం

ఒక అడవిలో చాలా పక్షులు, జంతువులు నివసిస్తూ వుండేవి.

ఒకరోజు అడవికి నిప్పు అంటుకొంది. చూస్తుండగానే అది పెరిగి పెద్దగయింది.

పక్షులూ, జంతువులూ తలోదిక్కూ పారిపోతూ వున్నాయి.

చేతగానివి మంటల్లో పడి చచ్చిపోతూవున్నాయి.

కానీ... ఒక పిట్ట మాత్రం పారిపోకుండా... తన చిన్న ముక్కుతో పక్కనే వున్న చెరువులోంచి కొంచం కొంచం నీటిని తీసుకొచ్చి మంటల మీద పోయసాగింది.

అది చూసిన ఒక కొంగ "ఓసీ... తిక్కదానా! నీవు పిడికెడంత గూడాలేవు. ఈ మంటలను ఆర్పడం నీ చేతనేమైతాది. పో... పోయి ప్రాణాలు కాపాడుకో పో" అంది.

పిట్ట చిరునవ్వుతో "నేను నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూ వున్నాను. నాలాగే అందరూ తమ తమ కర్తవ్యాలని నిర్వహిస్తే ఈ అడవిని కాపాడుకోవడం ఏమంత కష్టం కాదు" అంది.

ఆ మాటలను కొంగతో పాటు ఇతర పక్షులు, జంతువులు కూడా విన్నాయి. చేయి చేయి కలిపితే సాధించలేనిది ఏముంటుంది అనుకున్నాయి.

వెంటనే అవన్నీ కలసి మంటల మీద నీటిని చల్లడం మొదలుపెట్టాయి.



గడ్డి ముట్టని మేక

ఒక రైతు దగ్గర ఒక మేక ఉండేది. ఆ మేకకు ఆకలి చాలా ఎక్కువ. ఎప్పుడు ఆగకుండా తింటూనే వుండేది. ఒకరోజు రైతు "ఎవరైతే నా మేకను అడవిలోకి తీసుకుపోయి కడుపు నిండా మేపుకు వస్తారో వాళ్ళకు పదివేల రూపాయలు ఇస్తానని అలా చేయలేకపోతే తనకు వేయి రూపాయలు ఇవ్వాలని" దండోరా వేయించాడు. అది విని ఒకడు ఉరుక్కుంటూ వచ్చి "నేను మేపుకొని వస్తా" అన్నాడు.

మేకను అడవిలోకి తీసుకొని పోయాడు. పొద్దున్నుంచీ సాయంత్రం వరకు బాగా మేపుకొని తిరిగి వచ్చాడు. అప్పుడు రైతు మేకకు కడుపు నిండిందో లేదో తెలుసుకోవడానికి దానిముందు కొంత పచ్చగడ్డి వేశాడు. వెంటనే మేక ఆ పచ్చగడ్డి తినేసింది. దాంతోవాడు ఓడిపోయినట్టు ఒప్పుకొని వేయి రూపాయలు ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఆ రోజు నుండీ చాలా మంది పోటీపడ్డారు గానీ ఎవరూ గెలవలేదు.

ఒకరోజు రంగయ్య అనేవాడు ఆ ఊరికి వచ్చాడు. వాడు చాలా తెలివైనవాడు. జరిగిందంతా తెలుసుకొని "నేను మేపుకొని వస్తా" అంటూ దాన్ని అడవికి తీసుకుపోయాడు. అడవిలో పచ్చగడ్డి తీసుకొచ్చి దానిముందు వేశాడు. అది తినబోయింది. అంతలో రంగయ్య మంచి కట్టెతో దాని మూతి మీద రప్పుమని ఒకటి పెరికాడు. కాసేపటికి మళ్ళీ గడ్డి వేశాడు. అది మూతి పెట్టేలోగా మళ్ళీ పెరికాడు. అలా పొద్దున్నించీ సాయంత్రం వరకూ పెట్టడం... పెరకడం... పెట్టడం... పెరకడం. ఆఖరికి ఆ మేక గడ్డి వేస్తే తినడానికి మూతిపెడితే తంతారని భయపడి తినడం మానేసింది. సాయంత్రం రంగయ్య మేకను రైతు దగ్గరకు తీసుకుపోయాడు. రైతు మామూలుగానే నవ్వుతూ దానిముందు గడ్డి వేశాడు.

అది ముట్టుకుంటే ఒట్టు. రైతుకు ఏం జరిగిందో అర్థం కాలేదు. మట్టసంగా పందెం ప్రకారం పదివేల రూపాయలు రంగయ్యకు ఇచ్చేశాడు.



ఒక్క వరం

ఒక ఊరిలో శివయ్య అనే రైతు వుండేవాడు. అతడు చాలా పేదవాడు. బతకడం కోసం కట్టెలు కొట్టుకుంటూ వుండేవాడు.

శివయ్యకు పెళ్ళయి పదేళ్ళయింది. కానీ పిల్లలు లేరు. దాంతోపాటు వాళ్ళ అమ్మకు కళ్ళు సరిగా కనబడవు.

ఒక రోజు అడవిలో కట్టెలు కొట్టుకుందామని పోతూవుంటే... ఒక చెట్టు ధగధగా మెరిసిపోతూ కనబడింది.

పోయి దాన్ని నరకబోయాడు. అంతలో వనదేవత ప్రత్యక్షమయి "ఓ శివయ్యా... నన్ను నరకవద్దు. కావాలంటే నీకు ఒక వరం ఇస్తాను. కోరుకో" అంది.

శివయ్య కాసేపు ఆలోచించాడు.

కళ్ళు లేని అమ్మ గుర్తుకు వచ్చింది. పిల్లలు లేరని బాధపడుతున్న భార్య గుర్తుకు వచ్చింది. తిండి గూడా సరిగాలేని తన పేదరికం గుర్తుకు వచ్చింది. డబ్బు కోరుకోవాలా... పిల్లలు కోరుకోవాలా... తల్లి చూపు కోరుకోవాలా... అని బాగా ఆలోచించాడు.

అంతలో అతనికి ఒక ఉపాయం తట్టింది.

వెంటనే "తల్లీ... రత్నాలు, వజ్రాలు పొదిగిన బంగారు ఉయ్యాలలో నా కొడుకు నిద్ర పోతూవుంటే మా అమ్మ చూసేలా వరమివ్వు" అన్నాడు.

దేవత చిరునవ్వుతో "అలాగే" అంది.

అంతే... శివయ్య కోరికలన్నీ ఆ ఒక్క వరంతోనే తీరిపోయాయి.

కొండను మోసే వీరుడు

ఆదోని అనే ఊరిలో రామయ్య అనే పహిల్వాను ఒకడు వుండేవాడు.

ఆ పహిల్వానుకి బాగా గొప్పలు చెప్పుకోవడం అలవాటు.

ఒకసారి ఒక పెద్ద బండరాయిని ఎత్తి చూపించి "దీనిని మోసేంత మొనగాడు ఎవరయినా ఈ ఊరిలో వున్నాడా" అని అడిగాడు. ఎవరూ ముందుకు రాలేదు. అంతలో ఎల్లన్న అనేవాడు ముందుకు వచ్చాడు.

"ఈ బండరాయి కాదు, ఏకంగా అదిగో ఆ పెద్ద కొండనే మోస్తాను. కాకపోతే ఆరునెలలు నేను అడిగినవన్నీ నాకు పెట్టాలి. సరేనా" అన్నాడు.

పహిల్వాను 'సరే' అన్నాడు. ఎల్లన్న ఏవి అడిగితే అవి తెచ్చి ఇవ్వసాగాడు.

ఎల్లన్న ఆరు నెలలు బాగా మెక్కి బాగా లావయ్యాడు.

తరువాత రోజు జనాలంతా ఎల్లన్న కొండ ఎలా మోస్తాడో చూద్దామని వచ్చారు. ఎల్లన్న కొండ దగ్గరికి చేరుకొని అంగీ విప్పాడు.

తువ్వాలు నడుముకు చుట్టుకొని వంగి నిలబడ్డాడు.

"ఆ కొండ మోయడానికి నేను సిద్ధంగా వున్నాను. ఎవరయినా ఎత్తి నా వీపు మీద పెట్టండి" అన్నాడు.

"అదేంది... మేమెందుకు ఎత్తాలి" అన్నాడు పహిల్వాను.

ఎల్లన్న నవ్వుతూ "నేను కొండ మోస్తాను అన్నానే గానీ, ఎత్తి పెట్టుకుంటాను అనలేదు గదా... మీరు ఎప్పుడు నా వీపు మీద పెడితే అప్పుడు మోస్తాను" అన్నాడు.

అందరూ పహిల్వాన్ని చూసి నవ్వుతూ వెళ్ళిపోయారు.

అనుభవం

పారుమంచాల పక్కన ఒక చిన్న చెరువు వుంది.

అందులో రెండు కప్పలు వున్నాయి.

ఎండాకాలం రావడంతో ఆ చెరువు ఎండిపోయింది.

అప్పుడు చిన్నకప్ప పెద్దకప్పతో "ఇక్కడికి కొంచం దూరంలోనే ఒక పెద్ద బావి వుంది, అక్కడికి పోదామా" అంది.

సరేనని పెద్దకప్ప దానితో పాటే బైలుదేరింది.

పెద్దకప్ప బావిని చూసింది. అది చాలా లోతుగుంది. దాంతోపాటు నీళ్ళు కూడా అడుగున కొంచమే ఉన్నాయి.

"దీనిలోకి దూకుదామా" అడిగింది చిన్నకప్ప.

అప్పుడు ఆ పెద్దకప్ప "ఇందులోకి దూకడం సులభమే కానీ తిరిగి బైటకు రావడం కష్టం. నీళ్ళు గూడా ఎక్కువగా లేవు. ఎండిపోయిందనుకో చావడం తప్ప వేరే దారి ఉండదు" అంది.

చిన్న కప్ప దాని మాటను వినకుండా దూకేసింది.

పెద్దకప్ప అలాగే వెదుక్కుంటూ, వెదుక్కుంటూ ఇంకో పెద్ద చెరువు చేరుకొంది. ఎండాకాలం మరింతగా ముదిరింది.

బావిలోని నీళ్ళన్నీ ఆవిరయిపోయాయి. చిన్నకప్పకు దిక్కు తోచలేదు. ఎంత ఎగిరినా పైకి రాలేకపోయింది.

"పెద్ద కప్ప ఆ రోజు అనుభవంతో చెప్పిన మాట వినకపోతిని" అని బాధపడుతూ ఆ కప్ప చనిపోయింది.

పిల్లి - కోడిపుంజు

ఒక కలుగులో ఒక చిట్టి ఎలుక ఉంది.

ఒక రోజు ఆ చిట్టి ఎలుక వాళ్ళ అమ్మతో 'అమ్మా... అమ్మా... నేను అలా బైట తిరిగి వస్తానే' అని అడిగింది.

'సరేగానీ జాగ్రత్త. ఏదయినా దూరం నుంచే చూడు. దగ్గరికి పోకు' అని తల్లి హెచ్చరించింది. చిట్టి ఎలుక తిరుగుతూ వుంటే దానికి ఆ రోజు ఒక పక్షి, ఒక జంతువు కనబడ్డాయి. ఇంటికి పోగానే అది వాళ్ళ అమ్మతో 'అమా...అమా.. ఈ రోజు నాకు రెండు జంతువులు కనబడ్డాయి. ఒకటేమో మన ఇంటి దగ్గరే ఉంది. దానికి కాళ్ళు నల్లగా, ముక్కు వాడిగా వుంది. పెద్దపెద్ద రెక్కలున్నాయి. నన్ను చూడగానే కొక్కరకో అని అరిచింది. నేను భయపడి పోయాను.' అని చెప్పింది.

ఆ మాటలకు తల్లి నవ్వుతూ 'ఇంకొక జంతువు ఎలా ఉంది?' అని అడిగింది.

అప్పుడు ఆ చిట్టి ఎలుక 'దానికేమో పెద్ద తల, పచ్చని కళ్ళు, పెద్దతోక, మూతిమీద మీసాలు వున్నాయి. అది చాలా ముద్దుగా వుంది, నన్ను చూడగానే దా...దా... అని పిలిచింది నాకు బాగా నచ్చింది' అంది.

అప్పుడు తల్లి నవ్వి 'చూడు పాపా... భయంకరంగా వుందన్నావు చూడు అది కోడిపుంజు. మనకు మిత్రుడు. నీకు బాగా నచ్చిందని చెప్పావు చూడు... అది పిల్లి. మనకు శత్రువు. రూపాన్ని చూసి మోసపోకూడదు. జాగ్రత్త" అని హెచ్చరించింది.

ధనలక్ష్మి - దరిద్రలక్ష్మి

ఒకసారి ధనలక్ష్మికి, దరిద్రలక్ష్మికి తమలో ఎవరు అందంగా వున్నారు అనే విషయంలో గొడవ ప్రారంభమయింది.

ఎంత సేపయినా వాళ్ళ గొడవ తెగలేదు.

అంతలో వాళ్ళకి పొలానికి పోతూవున్న ఒక రైతు కనబడ్డాడు. వెంటనే ఆ రైతుని పిలిచి "మా ఇద్దరిలో ఎవరు అందంగా వున్నారో చెప్పు" అని అడిగారు. ధనలక్ష్మి బాగుందంటే దరిద్రలక్ష్మికి కోపం వస్తుంది.

దరిద్రలక్ష్మి బాగుందంటే ధనలక్ష్మికి కోపం వస్తుంది.

ఎవరికి కోపం వచ్చినా కష్టమే. రైతు బాగా ఆలోచించాడు.

"అమ్మా... ధనలక్ష్మీ! నీవు ఇంటిలోకి వచ్చేటపుడు అందంగా వుంటావు.

అమ్మా... దరిద్రలక్ష్మీ! నీవు ఇంటిలోంచి పోయేటప్పుడు అందంగా వుంటావు" అన్నాడు.

రైతు తెలివికి ఇద్దరూ నవ్వుకుని దీవించి వెళ్ళిపోయారు.

గ్రేడ్ - I

పొలమే బంగారం

కఠిన పదాలు లేని చిన్న కథలు



రచన

డా॥ యం. హరికిషన్